
# కసి • వల్లభ్



'దభేల్'మని కుండ బ్రద్దలైన చప్పుడుకు కంగారుగా తలెత్తారు పోలినాయుడు అతని మిత్రులు పేకలోంచి.

అక్కడ కోటమ్మ కాళికాదేవి పూనినట్లు వణుకుతోంది.

''ఏంటే! ఏమైంది?'' భయం భయంగానే అడిగాడు పోలినాయుడు భార్యని. ఊరందరికీ పులి, భార్య ముందు పిల్లి.

''ఏంటా? ఆ కులం తక్కువోణ్ణి తెచ్చి నా వెత్తిన పెట్టావు. మవ్వేమో మడత నలక్కుండా ఖుషీగా కూర్చుని కబుర్లాడుతుంటావు. ఇంట్లో ఏం జరుగుతోందీ పట్టించుకుందామన్న ధ్యాసే లేదు.''

ఆరేళ్ళ కోటిగాడు బిక్కు బిక్కుమంటూ వచ్చి నిల్చున్నాడు. వాడి కళ్ళు మరికొద్ది సేపట్లో వర్షం కురియబోతున్న మేఘాల్లా వున్నాయ్.

''ఈడికి మా చెడ్డ దాహమై పోయిందంట. దాహమైతే చెరువుకాడ్కిపోయి తాగొచ్చుగా! ఊహూ! చక్కగా ఇంట్లో కుండలో ఇత్తడి గ్లాసు ముంచి మరీ తాగుతున్నాడు.''

''ఒరి వీడి ధైర్యం మండా!'' విస్తుపోయాడు ఓ పోలినాయుడు స్నేహితుడు.

నలుగురి ముందూ భార్య తన పరువు తీసిందన్న బాధ హెచ్చుకాగా, ఆ కోపంతో రయ్యున లేచి దవడమీద చాచి ఒక్కటిచ్చాడు కోటిగాణ్ణి. ఆ దెబ్బకు కిందబడ్డాడు వాడు. పోలినాయుడి మిత్రులొచ్చి అడ్డుకుని సర్దారు. అప్పటికి కోటమ్మ కళ్ళు చల్లబడ్డాయి.

''ఈణ్ణి అప్పుడే వదుల్తానా! ఇంకాసేపట్లో వీడి బాబొస్తాడుగా! ఆడి సంగతి ఈడి సంగతి ఇవ్వాళే తేల్చేస్తాను.'' రంకెలు పెట్టాడు పోలినాయుడు. కులం తక్కువ కోటిగాడు తమ కుండలో నీళ్ళు తాగాడన్న కోపం ఒకపక్క, నలుగురి ముందూ తన పరువు పలుచనచేసిన భార్యపై చేతగాని కోపం మరోపక్క.

పోలినాయుడు అర్ధాంతరంగా మిడిల్ డ్రాప్ చేసి కిందపడేశాడు పేక.

** ** ** **

ధాన్యం గింజలకొచ్చిన ఎంకటేసు గాడి మీద మండిపడ్డాడు పోలినాయుడు. ఆదర్శ గృహిణి కోటమ్మ యథాశక్తి తనవాటా వడ్డించింది ఎంకటేసు ని. తిక్కరేగిన ఎంకటేసు పలుపుతాడు తీసి విరగబాదాడు కోటిగాణ్ణి. దాంతో పోలినాయుడు కాస్త మెత్తబడి, ''ఊరుకోరా! సస్తాడు'' అని జాలికూడా చూపించాడు. ఆ మాటకు మరి నాలుగు దెబ్బలు వడ్డించి ''ఈడ్నా కడుపున సెడబుట్టాడయ్యగోరూ! ఈణ్ణి బతకనియ్యరాదు'' అనిమరింతసంతోషం చేకూర్చాడు పోలినాయుడికి. రాక్షసానందం తో విరగబడిబోతూ "నియ్యవ్వ, నీ దెబ్బలేమోగానీ, పలుపుతాడు బోతే కొత్తది తేవాలో'' అని జోకాడు.

గేదెలకు గడ్డికోసం వాము దగ్గరకు వెళ్ళిన కోటిగాడు అక్కడ ఎంకటేసు ను చూసి ఆగిపోయాడు. గంటక్రితం నాయన అనబడే 'వీడు' కొట్టిన దెబ్బలకు ఒళ్ళంతా 'సలపరం పుడుతోంది. ' తను చేసిన తప్పేమిటి? దాహమైతే ఇంట్లో కుండలో నీళ్ళుతాగడం. ఆ కుండ

కడిగేదీ తనే! నీళ్ళు పోసేదీ తనే తాను తాగితే తప్పేమిటి!' ఎంత ఆలోచించినా ఆ చిన్ని బుర్రకు సమాధానం దొరకడం లేదు. మళ్ళీ కొడతాడేమోనని భయంగా చూస్తూ నిల బడ్డాడు.

ఎంకటేసు 'కోటిగాణ్ణి' లాగి ముద్దు పెట్టు కుని భోరుమన్నాడు. "ఒరే అయ్యా! నేనొచ్చే యేళకి నా ఎదురుగా వుండక. నీళ్ళకో, గడ్డికో ఏడికో ఓ చోటికో పో. లేపోతే రోజూ నిన్ను కొట్టాలొస్తుంది."

గంట క్రితం ఎందుకు కొట్టాడో, ఇపుడెం దుకు భోరుమంటున్నాడో మళ్ళీ కోటిగాడి బుర్రకి అందలేదు. కానీ ఆ చిన్ని మెదడులో కోపం......కసి......కొట్టిన తండ్రిమీద.. దొరమీద......దొరసానిమీద......చిదిరిం ముకుని వెళ్ళిపోయాడు కోటిగాడు.

** ** ** **

ఆ రాత్రి నిద్రపట్టలేదు కోటిగాడికి. ఆ చిన్ని మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు... అర్థం కాని ప్రశ్నలు...కడుపులో అగ్గిపెట్టినట్లుగా మండిపోతోంది. వాడికే సిద్ధాంతాలూ తెలియవు. వాడికి 'విప్లవము'నే మాటే తెలియదు. కానీ 'కసి' తీర్చుకోవడానికా అనేక ఆలోచనలు...... ఎందుకు అందరికీ అణిగి వుండాలనే ఆలోచన స్వేచ్ఛకై తపన. కానీ తన కసితీరే తరుణం మరునాడే వస్తుందని వూహించలేకపోయాడు.

కోటమ్మ 'పొలం' చూడడానికి వెళ్ళింది. పెద్ద పిల్ల వుండాలి కానీ 'అమ్మ' లేకపోవడంతో స్వేచ్ఛగా ఊరిమీద పడింది. ఎటొచ్చి పోలి నాయుడే వడ్డీ లెక్కలు చూసుకుంటూ ఇంట్లో వుండిపోయాడు. ఎంతకూ ఓ పట్టాన తరగని లెక్కలు. దస్తావేజులు తిరగేస్తున్నాడు. కిందా మీదా పడుతున్నాడు. ఒక్కసారిగా నాలుక పిడచగట్టుకుపోయినట్లుగా అయిపోయింది 'దాహం' అనుకున్నాడు.

గడపకెదురుగా మండువాలో వున్నాయ్ కొత్తకుండలో నీళ్ళు. తాగుదామంటే ఎవరైనా చూస్తే నామోషి! లేవడానికి బద్ధకం మరోపక్క. కాస్సేపు ఆలోచించాడు.

"ఒరే కోటిగా"

ప్రతి సమాధానం ఏమీరాలేదుగానీ మౌనంగా కాస్సేపటికి వచ్చి నిల్చున్నాడు కోటిగాడు గది గడప దగ్గర.

"బయట మండువాలో నీళ్ళున్నాయ్ గానీ గ్లాసు కడిగి నీళ్ళుతే" ఆర్డర్ జారీ చేశాడు.

మళ్ళీ ఒక్కసారిగా కడుపులోనుంచి సెగలు గొంతుకలోకొచ్చినట్టుగా ఫీలయ్యాడు. 'మంచి నీళ్ళ'నే పదం వినపడితేనే వులిక్కిపడుతున్నాడు. ఎవరో గొంతు బిగించినట్టుగా, ఊపిరాడనట్టుగా వుంది. తన చేత్తో ఇచ్చిన మంచినీళ్ళు తాగ డంలో తప్పులేదా? ఒక్కసారిగా కోటిగాడిలో అసహ్యం అణువణువునా పాకిపోయింది.

గ్లాసందుకున్నాడు. కడిగాడు. నీళ్ళలో ముంచాడు.

తను ముంచగానే నీళ్ళుమురికిగా తయారవ లేదే? మరి ఎక్కడుంది తన తప్పు?

నిన్నటి దెబ్బలు గుర్తుకు వచ్చి కళ్ళ నీళ్ళొ చ్చాయి. మళ్ళీ కడుపు మండింది. అటూ ఇటూ చూశాడు. ఎవరూ లేరు.

ఖాండ్రించి ఉమ్మేశాడు గ్లాసులో. ఎడమ చేతి చూపుడువేలితో గిరగిరా తిప్పాడు నీళ్ళని. బుడగలు కనపడకుండా మరోసారి తిప్పాడు.

మౌనంగా పోలినాయుడుకి అందించాడు.

గ్లాసు పైకెత్తి గటగటా తాగాడు పోలి నాయుడు.

ఆ సమయంలో, ఆ క్షణంలో కోటిగాడి ముఖంలో దివ్వెల కాంతులు. కసి పొరలు పొర లుగా విడి పడిపోతున్న చప్పుడు గుండెల్లో! ఏదో వెలుగు ఎంతో ఆనందం.

"ఇంకో గ్లాసు తెమ్మంటారా దొరా!" రోజు తర్వాత మొదటిసారిగా గొంతెత్తి మాట్లాడాడు.

## పావని—రావణునితో

ఇరువది చేతులున్న నిను హేలగ లీలగ చంక క్రింద కు
మ్మరి పురువుంబలెన్నదిపి మాట పెగుల్పగనీకనొక్కి—అం
బరమున ఇంద్రజాలమటు వాయుజవమ్మననేగి వార్ధులన్
పురపుర ముంచెవారి కనమో కపిరాజ పరాక్రమోద్ధతిన్ //
ఆ వారి తమ్ముడగు సు
గ్రీవుని సచివుండ కేసరీ పుత్రుండన్
ఆ విధి వర బలమున రా
ఘావని జననాథుదూతనై—భాషింతున్ //
పుట్టుక బ్రహ్మవంశము తపోవిభవమ్మన—ఏరుపొందరా
నట్టి వరంబులందితి—దురాసదమౌ విభవంబు—లంకస
మ్రాట్టుగజేసె రాక్షసుల మాయలనెట్టి వినంగదయ్య—లో
గుట్టది రట్టుకాకమును కోపము తాపము కట్టిపెట్టవే!
తరుణియు మాటయు ఒకటే
శరమున్ గురితప్పనట్టి జననాథుడు—భా
స్కర వంశతరణి రాముని
నరుగా నెంచకుము రావణా! ధీ ధిషణా!!
నరపతి యజ్ఞపాత్రమున నందిని పిండిన పాలనుర్వ్యు సో
మరసములోని తీపి మధుమాస రసాలము పూతలోని విం
తరుచి అయోధ్యలో మొలచు నందనకల్పక పారిజాత భా
స్కర వరదీప్తి నీవు—కనజాలవు—ఇర్వది కన్నులుండియున్
సీతయనగ—ఒక్కనాతిగానెంచి—ఒం
టరిగ దొంగిలించినంత—వింత
దొరతనమ్ము నిలుచు త్రోవయా? లంకకు
తలుపు తెరచినావె? దానవేంద్ర!!
ఆమె—అయోనిజ—దశరథ
రాముని యిల్లాలు—వేయి రావణులైనన్
మోమెత్తి చూడబోదు—ఈ
వేమనితెచ్చితివి? దానవేశ్వర! మాతన్ //
పుట్టునిచ్చిన తల్లినే—చెట్టబట్ట
కోరకుము కొరివితో—తల—గోకికొనకు—
రామ బాణాగ్ని దగ్ధమౌ లంక—యింక
వార్ధిదాటి రానీకు మీ వంక—రాము //
రాజువటంచు నీపదవి—రాజ్యము శాశ్వతమంచు మోహవి
భ్రాజిత మూఢతన్ వెతల రాపిడి పాపముపండనీకు—సా
మాజిక ధర్మసూత్రముల—మార్చుటకున్—ప్రయత్నింపబోకు—నీ
వాజిని గెల్వలేవు—జగదంబను—రాముని కొప్పజెప్పవే!!

(కవి సమ్రాట్ రామాయణ కల్పవృక్షమాధారంగా)

—మానాప్రెగ్గడ వేంకట సుబ్బరాయకవి